క్లుప్తంగా

రీ సర్వే వేగంగా పూర్తి చేయాలి



రీ సర్వే చేస్తున్న అధికారులు

దెందులూరు: రైతులకు ముందస్తు సమాచారం నోటీసు ఇచ్చి రీ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర అన్నారు. గురువారం మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామాలైన రామారావుగూడెం, కంద్రిగ నరసింహాపురం గ్రామాల్లో రీ సర్వే పనులను ఆయన పరిశీలించారు. మండల సర్వేయర్ విలేజ్ సర్వేర్లతో మాట్లాడారు. శాఖ పరమైన సర్వే సూచనలు చేశారు. భూమి సరి హద్దుల నిర్ధారణ సమయంలో రైతులు సర్వేకు హాజరై సహకరించాలని ఆయన కోరారు.

9872 మందికి ఉపాధి పనులు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ ఫాతిమా

దెందులూరు: మండలంలో 9872 మందికి ఉపాధి పనులు కల్పిస్తామని జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఓ ఫాతిమా అన్నారు. గురువారం మండలంలో దెందులూరు, చల్ల చింతలపూడి, శ్రీరామవరం, కొవ్వలి, పోతునూరు, గాలాయగూడెం, పెరుగ్గూడెం గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేసి శాఖాపరమైన సూచనలు చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, వసంత కుమారి దంపతులు శ్రీలక్ష్మీనారాయణ స్వామి, రాజశ్యామల, గరుడ, ఆంజనేయ, వినాయక ఆలయాల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కూటమి నాయకులు కార్యకర్తలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల తరలింపుపై కేసు నమోదు



కోళ్ల వ్యర్థాలను తీసుకెళుతున్న వాహనం

దెందులూరు: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఏపీ 39 టీజీ 2809 ట్రక్ ఆటోపై కేసు నమోదు చేశామని ఎస్సై ఆర్.శివాజీ తెలిపారు. దెందులూరు సమీప ప్రాంతాల నుంచి ఉంగుటూరు మండలం తోకలపల్లికి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారన్నారు. వాహన యజమాని, వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

సిగ్నల్ లైట్ల ఏర్పాటు



సోమవరప్పాడు వద్ద ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు

దెందులూరు: స్థానికంగా జంగారెడ్డిగూడెం రోడ్డు సోమవరప్పాడు వద్ద డబల్ రోడ్డు పాయింట్‌లో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా డబల్ రోడ్డు స్టార్టింగ్ పాయింట్‌లో ఎటువంటి సూచిక లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. దీంతో ఆర్ అండ్‌బీ అధికారులు డబల్ రోడ్డు పాయింట్ వద్ద సూచికతో పాటు సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, పాదచారులు సమీప గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి క్షేత్రంలో భారీగా ఉపనయనాలు, వివాహాలు



క్షేత్రంలో ఉపనయన వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గురువారం ఉపనయనాలు, వివాహాలు భారీగా జరిగాయి. మంచి ముహూర్తం కావడంతో అనివేటి మండప ప్రాంతం, కొండపైన దేవస్థానం కల్యాణ మండపాల్లో ఈ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. స్వామివారి పాత కల్యాణ మండప ప్రాంతం, ప్రైవేట్ పంక్షన్ హాళ్లలో వివాహాలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

మండలాలకు చేరుతున్న పాఠ్య పుస్తకాలు

- పాఠ్య పుస్తకాల కుదింపు.. 70 శాతమే వచ్చిన పుస్తకాలు
- నేటి వరకూ 45కి 34 టైటిల్స్ పంపిణీ
- పుస్తకాల మోత తగ్గించిన విద్యాశాఖ
- 9వ తరగతి వరకూ లాంగ్వేజీలన్నీ ఒకే బుక్‌లో



నిడమర్రు స్టాక్ పాయింట్‌లో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో భాస్కర్



గణపవరంలో తరగతి, సబ్జెక్టుల వారీగా కట్టలు కడుతున్న సీఆర్పీలు

నిడమర్రు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాల విద్యాశాఖలో అనేక సంస్కరణలు అమలు చేసింది. దీనిలో భాగంగా అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేసింది. అప్పుడు ఇంగ్లీషు మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియం కంటెంట్‌ను (బైలాంగ్వేజ్) పక్క పక్క పేజీల్లో ఉండేలా చర్యలు తీసుకుంది. అలాగే 1 నుంచి 10వ తరగతి వరకూ ఉన్న పాఠ్య పుస్తకాలను బరువు తగ్గించేలా రెండు సెమిస్టర్లుగా పంపిణీ చేశారు. పాఠశాల విద్యలో ఇప్పటి వరకూ 80 టైటిల్స్ వరకూ ఉన్న పాఠ్య పుస్తకాలను 45 టైటిల్స్‌కు విద్యాశాఖ అధికారులు కుందించారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి ఇది అమలవుతుంది. దీంతో పుస్తకాల బరువు సగానికి తగ్గినట్లైందని సిబ్బంది చెపుతున్నారు నియోజకవర్గంలోని నాలుగు మండలాల స్టాక్ పాయింట్స్‌కు మొదటి విడత పాఠ్యపుస్తకాల పంపిణీ 80 శాతం వరకూ అందినట్లు ఆయా మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. వీటి సరఫరా బాధ్యత ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ తీసుకుంది. స్టాక్ పాయింట్స్‌కు అందిన పాఠ్యపుస్తకాలను క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ తరగతులు, సబ్జెక్టుల వారీగా కట్టలు కట్టి పాఠశాలల వారీగా అందించేందుకు సిద్ధం చేస్తున్నారు.

భాషలన్నీ ఒకే బుక్‌లో

రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసే పాఠ్యపుస్తకాల టైటిల్స్ కుదించారు దీంతో మోత తగ్గి విద్యార్థుల స్కూల్ బ్యాగ్ తేలికవ్వనుంది. మొత్తం 45 టైటిల్స్‌కు గాను ఇప్పటి వరకూ 34 టైటిల్స్ సరఫరా కాగా మిగిలిన 11 టైటిల్స్‌లో ఇప్పటి వరకూ ఒక్క పుస్తకం కూడా సరఫరా కాలేదని ఆయా మండల ఎంఈవోలు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో భాషల (తెలుగు, ఇంగ్లీషు, హిందీ) సబ్జెక్టులన్నింటినీ ఒకే పుస్తకంగా ముద్రించారు. గత ప్రభుత్వం అమలు చేసిన సెమిస్టర్ విధానంలో అందిస్తుండటంతో విద్యార్థులకు పుస్తకాల బ్యాగ్ తేలిక కానుంది. భాషేతర సబ్జెక్టులను ఇంగ్లీషు, తెలుగు మాధ్యమంలో గత సర్కారు మాదిరిగానే పక్కపక్క పేజీల్లో ముద్రించారు. మొత్తం ఇండెంట్‌లో మొదటి విడతగా 70 శాతం వరకూ మండలాలకు చేరాయి. వీటిని ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా మండలాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో 2025–26 విద్యాసంవత్సరంలో ఇండెంట్

మండలం	ప్రభుత్వ విద్యార్థులు
ఉంగుటూరు	6,291
భీమడోలు	4,893
గణపవరం	4,462
నిడమర్రు	3,083
మొత్తం	18,729

తరగతి వారీగా వివరాలు

1వ తరగతి, 2వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు ఒకే పాఠ్య పుస్తకంగా ముద్రించారు. ఈ మూడు సబ్జెక్టులకు సంబంధించి వర్క్‌బుక్ కూడా ఒకే పుస్తకంలో ఉంది. అంటే 1, 2వ తరగతి విద్యార్థులకు కేవలం రెండు పుస్తకాలు మాత్రమే ఉంటాయి. 3, 4, 5వ తరగతులకు తెలుగు, ఇంగ్లిష్ ఒక పుస్తకం, గణితం, పరిసరాల విజ్ఞానం పాఠాలు మరో పుస్తకంగా ఇవ్వనున్నారు. పాఠ్య పుస్తకాల తరహాలో వర్క్‌బుక్ కూడా రెండేసి సబ్జెక్టులకు ఒకటి చొప్పున వర్క్‌బుక్‌గా ముద్రించారు. దీంతో ఈ మూడు తరగతులకు నాలుగు పుస్తకాలు ఉంటాయి.

హైస్కూల్ స్థాయిలో..

6, 7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులకు ఒక పుస్తకం, గణితం, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు వేర్వేరుగా మొత్తం నాలుగు పాఠ్య పుస్తకాలుగా ముద్రించారు. 8వ తరగతికి తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులకు ఒక పుస్తకం, గణితం, సోషల్, ఫిజికల్ అండ్ బయాలాజీ సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరుగా మొత్తం 4 పుస్తకాలు ఇవ్వనున్నారు. 9వ తరగతికి తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లకు ఒక పుస్తకం, గణితం ఒక పుస్తకం, పీఎస్ అండ్ బీఎస్‌కు ఒక పుస్తకం, సోషల్‌కు ఒక పుస్తకం, ఇంగ్లిష్ వర్క్, ఎక్స్‌ప్రెషన్స్ వర్క్‌బుక్ కలిపి ఒకటి మొత్తం ఐదు పుస్తకాలు ఇస్తారు. 10వ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ, గణితం, పీఎస్, బయాలజీ, జియోగ్రఫీ, హిస్టరీ, డెమొగ్రఫిక్ పాలిటిక్స్ అండర్ స్టాండింగ్ విఖాస్‌మస్ డెవలప్‌మెంట్ మొత్తం 12 పుస్తకాలుగా విద్యాశాఖ ముద్రించింది.

7, 8 తరగతులకు పూర్తిగా రాలేదు



మండలానికి ఇప్పటి వరకూ 45 టైటిల్స్‌కు 34 టైటిల్స్ అందాయి. 7, 8 తరగతులకు మినహా మిగిలిన అన్ని తరగతులకు అవసరమైన పాఠ్య పుస్తకాల టైటిల్స్ అందాయి. ఇప్పటి వరకూ స్టాక్ పాయింట్‌కు 34 టైటిల్స్‌కు సంబంధించి 8956 పాఠ్య పుస్తకాలు అందాయి. వీటిని పాఠశాలల ఇండెంట్ ప్రకారం తరగతి, సబ్జెక్టుల వారీగా సీఆర్పీలు కట్టలు కట్టి పాఠశాలలకు అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. –ఏవీఎస్ఎన్ భాస్కర్, ఎంఈవో–2, నిడమర్రు

సమన్వయంతో పనిచేయాలి

ఏలూరు(మెట్రో): దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో నిర్వహించిన దెందులూరు నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్, పశుసంవర్ధక శాఖ, పీఆర్, ఆర్అండ్‌బీ, విద్యుత్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన వివిధ అంశాలపై తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి



పాటలు పాడుతున్న చిన్నారులు, సంఘస్తులు

దెందులూరు: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ విజన్ దేవదాస్ అన్నారు. దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో బైబిల్ మిషన్ దెందులూరు పాస్టర్ దైవారావ్ ఆధ్వర్యంలో బైబిల్ మిషన్ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైస్ ప్రెసిడెంట్ జాయింట్ సెక్రటరీ డి.సుధాకర్ విచ్చేశారు. క్రీస్తు రాక, క్రీస్తు వలన కలిగే ఆశీర్వాదాలు క్రైస్తవ జీవన విధానం సువార్త విశ్వ వ్యాప్తి గురించి సుదీర్ఘంగా ప్రసంగించారు. అనంతరం అతిథులను పాస్టర్ దైవారావ్ కుటుంబ సభ్యులు సంఘస్తులు శాలువ జ్ఞాపికతో సత్కరించారు. దెందులూరుతో పాటు సమీప మండలాల నుంచి అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటాడుకుందాం



దెందులూరు: పోతునూరు గ్రంథాలయంలో ఆటలాడుతున్న విద్యార్థులు



భీమడోలు: రెడ్‌క్రాస్ సేవలను వివరిస్తున్న మానవత జిల్లా డైరెక్టర్

దెందులూరు: విద్యావేత్తలు, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో చిన్నారులు సందడి చేస్తున్నారు. కథలు చెప్పడం, వినడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్‌లు, ఆటలు, క్రీడలతో పాటు ఆంగ్లంలో మాట్లాటం, చదరంగం, క్యారమ్స్, క్విజ్, జనరల్ నాలెడ్జ్ మొదలైన అంశాల్లో నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 77 గ్రంథాలయాల్లో కొనసాగుతున్న ఈ శిబిరాల్లో రోజూ సగటున 3500 మంది చిన్నారులు పాల్గొంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. శిబిరాల్లో పాల్గొంటున్న

గ్రంథాలయాల్లో చిన్నారుల సందడి

విద్యార్థుల కోసం సుమారు 200 మందికి పైబడి నిపుణులు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. జూన్ ఆరో తేదీ వరకు నిర్వహించనున్న శిబిరాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ రిసోర్స్ పర్సన్లు సూచించారు.

రెడ్‌క్రాస్ సేవలు అజరామరం

భీమడోలు: రెడ్ క్రాస్ సేవా సంస్థ సేవలు అజరామరమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు పదో రోజైన గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సామూహిక పుస్తక పఠనం చేశారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సామాజిక కార్యకర్త గేదెల ఈశ్వరమ్మ చిన్నారులు భగద్గీత శ్లోకాలు నేర్పించారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి సామూహిక పుస్తక పఠనం, వివిధ పోటీలను నిర్వహించారు.

వేసవి సెలవులు ఎంజాయ్ చేస్తున్నాం



వేసవి సెలవులను చాలా ఎంజాయ్ చేస్తున్నాము గ్రంథాలయంలో నీతి కథలు చెబుతూ మాతో చెప్పిస్తూ ఆటలు పాటలు పోటీలు పెడుతున్నారు స్నేహితులందరితో సరదాగా గడుపుతున్నా. –వంశీ, నాల్గో తరగతి విద్యార్థి, చాటపర్రు

గ్రంథాలయం బాగా ఉపయోగపడుతుంది



వేసవి సెలవుల్లో గ్రంథాలయం బాగా ఉపయోగపడుతుంది. విజ్ఞానం వినోదం ఆటలు పాటలు పోటీలతోపాటు స్నేహితులు అందరూ రోజు కలుస్తున్నాం. తల్లిదండ్రులు గ్రంథాలయ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. –యశస్విని, ఆరో తరగతి విద్యార్థిని, చాటపర్రు

వివాదాస్పదంగా ఆక్రమణల తొలగింపు



డ్రైయినేజీపై ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

టాస్క్‌ఫోర్స్: భీమడోలు పంచాయతీ శివారు నాచేటిగుంటలో డ్రెయినేజీపై ఉన్న ఆక్రమణల తొలగింపు వివాదస్పదంగా మారింది. ఈ ఆక్రమణల తొలగింపు పర్వంపై గ్రామ కార్యదర్శిపై ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విధులకు ఆటంకం కలిగించిన అతతడిపై గ్రామకార్యదర్శి భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే భీమడోలు పంచాయతీ కార్యదర్శి కోటి రూపాయల నిధులు దుర్వినియోగం చేశారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో నాపై కక్ష సాధింపు చర్యగా గ్రామంలోని నా ఇంటి గోడను బుధవారం ఆక్రమణల సాకుతో కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో పడగొట్టించారని భీమడోలు పంచాయతీ శివారు నాచేటిగుంటకు దళిత నేత కొత్తపల్లి చంద్రమౌళి పోలీస్ ఉన్నతాధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు విచారణలో ఉందని, ఉపసంహరించుకోవాలని బెదిరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి తనూజను వివరణ కోరగా గ్రామంలో ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు తీసుకోవాల్సిన అవసరం నాకు లేదన్నారు. నాపై చంద్రమౌళి మార్చి నెలలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడని తెలిపారు. గ్రామానికి చెందిన చుక్కా రాజు నాచేటిగుంటలో డ్రెయినేజీలను ఆక్రమించుకోవడం వలన మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగింపు కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఉంగుటూరు: కేంద్ర ప్రభుత్వం రైతుల పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం కైకరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన సంఘం ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా కార్మికులు సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నారని, ఈ సమ్మెకు మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు గుత్తికొండ వెంకట కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పుతో ఉలిక్కిపడ్డ రైతులు



ట్రాక్టర్‌పై టార్పాలిన్లతో కప్పి ఉంచిన ధాన్యం

భీమడోలు: గురువారం సాయంత్రం భీమడోలులో వర్షం కురవడంతో రైతులు ఉలిక్కిపడ్డారు. వాతావరణంలో విభిన్న మార్పులు సంభవిస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే రైతులు దాళ్వా వరి మాసూళ్లు 90 శాతానికి పైగా పూర్తి చేసుకున్నారు. ఇంకా కొంత మంది రైతులు ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకోకపోవడంతో పాటు రైతుసేవా కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. అదే విధంగా టార్గెట్లు పూర్తి కావడంతో పాటు సంచులు ఇవ్వకపోవడం, వాతావరణ హెచ్చరికలతో నేపథ్యంలో రైతులు బస్తాకు రూ.50 నుంచి రూ.70 తగ్గించి దళారులకు అమ్మేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆందోళనల నేపథ్యంలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 60 నుంచి 80 శాతానికి పెంచారు. అయితే ఇప్పటికే రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని తీవ్ర నష్టాన్ని చవి చూశారు. కొన్నిచోట్ల రైతులు ధాన్యాన్ని టార్పాలిన్లు కప్పి భద్రపరుచుకున్నారు.

కుట్టు మిషన్ల పేరుతో బీసీలకు కుచ్చుటోపీ



శెట్టి త్యాగరాజా

గణపవరం: కుట్టుమిషన్ల పేరు చెప్పి కూటమి ప్రభుత్వం బీసీ మహిళలకు కుచ్చుటోపీ పెడుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సూర్యబలిజ విభాగం అధ్యక్షుడు శెట్టి త్యాగరాజు విమర్శించారు. గురువారం ఆయన గణపవరంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీ మహిళలకు చేయూత పథకం కింద ఇచ్చే కుట్టు మిషన్లు సక్రమంగా అర్హులకు అందిస్తుందన్న నమ్మకం లేదని, నాసిరకం మిషన్లు లబ్ధిదారులకు పంచిపెట్టి కోట్ల రూపాయల కుంభకోణానికి తెరలేపిందన్నారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఈ అవినీతి భాగోతంపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

పరస్పర కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పరస్పర కేసులు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంగిడిగూడెంకు చెందిన గంజి వినోద్‌కుమార్ జంగారెడ్డిగూడెం పట్టణంలో డ్రై ఫ్రూట్స్ షాపు నడుపుతున్నాడు. ఈనెల 2న వినోద్‌కుమార్ తన షాపు వద్ద స్నేహితుడు మోసెస్‌తో కలిసి మద్యం తాగుతుండగా, పట్టణానికి చెందిన మానుకొండ కిషోర్, మోల్లా సురేశ్, పైడిమాల ప్రణయ్, ప్రగడ నారాయణలు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. దీనిపై వినోద్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఈ నెల 2న స్థానిక అశ్వారావుపేట రోడ్‌లో శ్యాంసంగ్ షోరూం వద్ద పట్టణానికి చెందిన మోల్లా సురేశ్, పైడిమాల ప్రణయ్‌లను పంగిడిగూడెంకు చెందిన గంజి వినోద్‌కుమార్, మోసెస్‌లు అసభ్యకరంగా మాట్లాడి తీవ్రంగా కొట్టారు. దీంతో నేకూరి కిషోర్, వినీత్‌లు ప్రణయ్‌కు ఫోన్ చేసి హైదరాబాద్ నుంచి కొందరు వ్యక్తులు వచ్చారని, ప్రణయ్‌ను చంపేస్తామని బెదిరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గంజి వినోద్‌కుమార్, వర మోసెస్, నేకూరి కిషోర్, కొత్తూ రి వినిత్ వర్మ, బశీదు రాహుల్, ముట్టబోయిన సాయి, ఎస్ నరసింహ అనినాష్, బూడిద ప్రేమ్‌కుమార్‌లపై కేసులు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ప్రహరీ కూల్చివేతను ఖండించిన దళిత సంఘాలు



కలెక్టరేట్ వద్ద మాట్లాతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఏలూరు (టూటౌన్): భీమడోలులో కొత్తపల్లి చంద్రమౌళికి చెందిన ప్రహరీ కూల్చివేతను ఎంఆర్‌పీఎస్ నాయకులు ఖండించారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, డీపీఓ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు మాట్లాడుతూ భీమడోలు గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన కొత్తపల్లి చంద్రమౌళి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు, లోకాయుక్త కోర్టుకు ఫిర్యాదు చేశాడని చెప్పారు. ఈలోగా పంచాయతీ ఉద్దేశపూర్వకంగా చంద్రమౌళికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా జేసీబీ, ట్రాక్టర్‌తో వెళ్లి ఇంటి ప్రహరీ కూల్చి విధ్వంసం సృష్టించిన తీరును ఖండిస్తున్నామని తెలిపారు. పంచాయతీలను నకిలీ బిల్లులతో దోపిడీ చేసే ఇటువంటి ఉద్యోగులను డిస్మిస్ చేయాలన్నారు. జిల్లా అధికారులను కలిసిన వారిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు కందుల రమేష్, కాశీ కృష్ణ, కొత్తపల్లి మురళీ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణ మహోత్సవాలు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో శ్రీపద్మావతి అలివేలు మంగా సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పోలవరం, బోడిగూడెం, పాత పట్టిసీమ గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణ మహోత్సవాలను తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. పోలవరం గ్రామంలోని నూతన ఆలయంలో వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వేపకాయల రాంబాబు, శ్రీదేవి దంపతులు నిర్వహించారు. సాయంత్రం కల్యాణ మహోత్సవాలను ప్రారంభించారు. బోడిగూడెం గ్రామంలో శ్రీ గిరి పర్వతంపై నిర్వహించిన వెంకటేశ్వస్వామి కల్యాణ మహోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



వేంకటేశ్వరుని కల్యాణోత్సవం ప్రారంభిస్తున్న అర్చకులు

భీమడోలు: దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని గుండుగొలనులో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మదాయశాఖ, ఉత్సవ కమిటి సంయుక్త ఆధ్వర్యంలో స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీవిశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని కల్యాణోత్సవాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తుంది. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ఉత్సవ కమిటి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లను వధూ వరులుగా అలంకరించారు. రాత్రి ధ్వజారోహనం కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. పూజారి మంగపతి ఆచార్యులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రికి నారాయణవనం మండపంపై శ్రీదేవి, భూదేవి శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మోహన్ కృష్ణాచార్యులు, వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు, భక్తులు పాల్గొన్నారు.